తల్లి పండక్కి రారండహో..



చెక్క బొమ్మల మధ్య భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడిమాంబ పండగ చాటింపు ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు చదురుగుడి వద్ద సంప్రదాయంగా జరిగింది. ముందుగా ఆలయ సహాయ కమిషనర్ డి.వి.వి.ప్రసాదరావు, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు సారథ్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన వేపచెట్టు వద్ద ఉన్న చెక్క బొమ్మలను గర్భగుడిలో పెట్టి పూజలు చేశారు. దీపధూప నైవేద్యాలు సమర్పించారు. డప్పుల వాయిద్యాల నడుమ తలయారీ రామవరపు చినపైడిరాజు, మరికొంతమంది కుటుంబీకులు సిరిమాను సంబరం ఈ నెల 15న జరుగుతుందని అమ్మవారి గర్భగుడిలో, ఆలయ ప్రధాన మెట్లపై చాటింపు వేశారు. ఎంజీరోడ్డు ప్రధాన మార్గం నుంచి గంటస్తంభం, కన్యకా పరమేశ్వరి ఆలయం, మార్కెట్ ప్రాంతాల్లోనూ, పైడిమాంబ పుట్టినిల్లు కోటకు డప్పు వాయిద్యాల నడుమ వెళ్లి చాటింపు చేశారు. ఇక్కడ నుంచి యథావిధిగా భక్తులు ఘటాల మొక్కులు తీర్చుకోవచ్చని, బంధువులు, స్నేహితులకు పండగ పిలుపులు ప్రారంభించుకోవచ్చని పైడిరాజు ప్రకటించారు. ఆదివారం ఉదయం అమ్మవారు పుష్పాలంకరణలో భక్తులను కనువిందు చేశారు.

సంప్రదాయబద్ధంగా పైడితల్లి ఉత్సవ చాటింపు



చదురుగుడి మెట్టు మీద చాటింపు వేస్తున్న తలయారి చినపైడిరాజు



ఘటాలతో భక్తులు

పూజారుల వేతనాల పెంపునకు చర్యలు

బొండపల్లి, న్యూస్‌టుడే: హిందూ దేవాలయాల్లోని పూజారుల వేతనాలు పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బొండపల్లి మండలం దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరి అమ్మవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదాయం లేని చిన్న ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యాలకు ప్రస్తుతం అందిస్తున్న సాయాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచనున్నట్లు తెలిపారు. దీనికి ముందు పూజారులు మంత్రిని పూర్ణకుంభంతో ఆహ్వానించారు. వేద పండితులు శ్రీధర్‌శర్మ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం.శ్రీధర్, పీవీవీ గోపాలరాజు, గంట్యాడ శ్రీదేవి పాల్గొన్నారు.



మంత్రిని పూర్ణకుంభంతో ఆహ్వానిస్తున్న పూజారి

యువకుడి వీడియోపై ఉప ముఖ్యమంత్రి స్పందన



వంతెన నిర్మించాల్సిన శాసనాపల్లి గెడ్డ

జామి, న్యూస్‌టుడే: జామి మండలం శాసనాపల్లిలో పెదవేమలి గెడ్డపై వంతెన నిర్మించకపోవడంతో గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులపై గ్రామానికి చెందిన ఓ యువకుడు వీడియో తీసి.. సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించారు. గ్రామానికి మూడువైపులా నీరు.. ఓ వైపు మాత్రమే రోడ్డు ఉందని, వర్షాకాలంలో గెడ్డ మునిగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వీడియోలో యువకుడు వివరించాడు. స్పందించిన ఉప ముఖ్యమంత్రి.. జిల్లా అధికారులతో మాట్లాడి శాశ్వతంగా పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పందించి.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, కొంత సమయం కావాలని కోరారు.

ఆర్నెళ్లకు సరిపడా ఇసుక సిద్ధం



వివరాలు వెల్లడిస్తున్న జేసీ సేధుమాధవన్, పక్కన ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ఇసుక కొరత లేదని, ఆరు నెలల అవసరాలకు సరిపడా సిద్ధంగా ఉందని సంయుక్త కలెక్టర్ ఎస్.సేధుమాధవన్, ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. నూతన ఇసుక పాలసీ, ప్రస్తుతం లభ్యత, అక్రమ రవాణాపై తీసుకునే చర్యల వివరాలు ఆదివారం ఎస్పీ కార్యాలయంలో వెల్లడించారు. ప్రస్తుతం బొబ్బిలిలో సుమారు 300 టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, రవాణా, హ్యాండ్లింగ్ ఛార్జీల కింద టన్నుకు రూ.577 చొప్పున వినియోగదారులు చెల్లించాలన్నారు. వంగర మండలం కొండచాకరాపల్లి వద్ద లభించనున్న సుమారు 70 వేల టన్నుల ఇసుకను బొబ్బిలి నిల్వ కేంద్రానికి తరలించి వినియోగదారులకు సరఫరా చేస్తామన్నారు. చీపురుపల్లిలో త్వరలో నిల్వ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. తెర్లాం, సంతకవిటి మండలాల్లో కొత్తగా గుర్తించిన రేవుల్లో 15న తవ్వకాలు ప్రారంభించి 16 నుంచి ఇసుక అందుబాటులో తీసుకొస్తామన్నారు. జిల్లాలో నెలకు 30 వేల టన్నుల చొప్పున రానున్న 6 నెలలకు సుమారు 1.80 లక్షల టన్నులు అవసరం ఉంటుందని అంచనా వేశామని, రేవుల ద్వారా 2 లక్షల టన్నులు లభ్యం కానుందన్నారు.

పాపం.. తోటపల్లి



తోటపల్లి జలాశయం

తోటపల్లి ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి విజయనగరం జిల్లా సస్యశ్యామలం అవుతుంది. కానీ ఏళ్లుగా పనులు ముందుకు కదలక పోవడంతో అన్నదాతలు వరుణుడి కరుణపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఏటా దీని పరిధిలోని పొలాలు ఎండిపోయి అప్పులే మిగులుతున్నాయి. గత అయిదేళ్లలో ప్రాజెక్టు అభివృద్ధి పనుల్లో పెద్దగా పురోగతి లేదనే చెప్పాలి.

గత సర్కారు నిర్లక్ష్యంతో బాలారిష్టాలు

విజయనగరం - ఈనాడు, పార్వతీపురం, న్యూస్‌టుడే

తెదేపా అధికారంలోకి వచ్చిన తర్వాత 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తోటపల్లిని ప్రాధాన్య ప్రాజెక్టుగా గుర్తించారు. సాగునీరు విడుదల చేయాలన్న లక్ష్యంతో పనులు పరుగులు పెట్టించారు. అవసరమైన ప్రతి పనికీ నిధులు కేటాయించడంతో 2016 నాటికి సాగునీరు విడుదలైంది. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత పనులు రద్దు చేయడంతో ప్రాజెక్టు పగతి పడకేసింది.

ప్యాకేజీ-2దీ అదే పరిస్థితి

రెండో ప్యాకేజీ కింద చీపురుపల్లి, రాజాం, విజయనగరం ప్రాంతాల్లో పనులు చేయాలని నిర్ణయించి రూ.63.63 కోట్లు మంజూరు చేశారు.

◆ ఈ నిధులతో తోటపల్లి ప్రధాన కాలువ మైలురాయి 48.88 కిలోమీటరు నుంచి 117.89 కిలోమీటరు వరకు పనులు చేయాల్సి ఉంది. ఈ పరిధిలో 4 బ్రాంచి కాలువలు, 29 డిస్ట్రిబ్యూటరీలు, 7,811 స్ట్రక్చర్లు నిర్మించాలి. వీటిలో 6 వేల వరకు పనులు చేశారు. కొన్ని చోట్ల పిల్ల కాలువలను తవ్వాల్సి ఉంది. ఈ పనులు కూడా 25 శాతం లోపే జరిగాయి. ప్రస్తుత ప్రభుత్వం 25 శాతం లోపు పనులు ఆపాలని సూచించడంతో ప్యాకేజీ 1, 2 పనులపై ప్రభావం పడింది.

అయిదేళ్లలో 18 శాతమే

2019లో పనులు రద్దు చేసిన వైకాపా ప్రభుత్వం మళ్లీ కొన్నాళ్లకు రెండు ప్యాకేజీలుగా మంజూరు చేసింది.

- ప్యాకేజీ-1 కింద రూ.59.58 కోట్లు కేటాయించారు. వీటితో తోటపల్లి డివిజను పరిధిలోని ఉల్లిభద్ర కుడి ప్రధాన కాలువ ప్రారంభం నుంచి పనులు నిర్వహించాల్సి ఉంది.
- మట్టికట్ట బలోపేతం చేయాలి. నది ప్రవాహ ప్రాంతంలో రెండు వైపులా వరద కట్ట కోతకు గురి కాకుండా చూడాలి.
- మట్టికట్టపై విద్యుద్దీపాలు, గ్యాలరీ గోడ బాగు చేయాలి.
- 20,521 ఎకరాలకు సాగునీరు అందేలా 9 ఓటీ స్లూయిస్‌లు నిర్మించాలి. దీని కింద 540 స్ట్రక్చర్లు నిర్మించాలని భావించారు. కానీ ప్యాకేజీ-1లో చేపట్టిన పనుల్లో 18 శాతం మాత్రమే జరిగాయి.



గట్టుకు లైనింగ్ పనుల పరిస్థితి ఇదీ

అవసరంపై నివేదిక ఇస్తాం

పనుల ప్రగతి 25 శాతం లోపు ఉంటే నిలిపివేయాలని ప్రభుత్వం సూచించింది. తోటపల్లి ప్రాజెక్టు పనులు కొనసాగించాల్సిన అవసరం చాలా ఉంది. దీనిపై ప్రత్యేక నివేదిక అందజేస్తే తిరిగి మంజూరు వస్తాయని తోటపల్లి డివిజను కార్యాలయ ఇంజినీరింగ్ అధికారి ఒకరు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

నిధులు అవసరం

ఇక ఆయకట్టు 1,31,221 ఎకరాల్లో సుమారు 64 వేల ఎకరాలకు ఏటా సాగునీరు అందించడం గగనం అవుతోంది. ఇంత వరకు ఈ ప్రాజెక్టు కింద రూ.867.79 కోట్లు వెచ్చించారు. మిగిలిన పనులు పూర్తి చేసే నాటికి దీని వ్యయం 1,127.58 కోట్లకు చేరుతుంది. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పంట కాల్వలు బలహీనపడిన ఆరేడు చోట్ల గండ్లు పడ్డాయి. వాటి మరమ్మతులకు రూ.కోటి అవసరం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తోటపల్లి ప్రాజెక్టుకు తక్షణం రూ.6 కోట్లు ఖర్చవుతుందని అంచనా. 118 కి.మీ ప్రధాన కాలువ పనులు ఈ అయిదేళ్లు ఎక్కడా చేపట్టలేదు. ఎక్కడికక్కడ షట్టర్లు సైతం బలహీనమయ్యాయి. వీటి బలోపేతానికి రూ.4 కోట్లు ఇవ్వాలని అధికారులు కోరారు. 'ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులను బట్టి త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. వాటితో వచ్చే ఖరీఫ్‌నకు పూర్తి ఆయకట్టుకు నీరందించేందుకు ప్రయత్నిస్తామని' ఈస్ట్‌కోస్ట్ జల వనరుల శాఖ ఎస్ఈ ఎస్.సుగుణాకరరావు తెలిపారు.

174 మందిపై కేసులు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినందుకు చర్యలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో శనివారం మద్యం తాగిన 174 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టి వాహన తనిఖీలు, బహిరంగ ప్రదేశాల్లో దాడులు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందిపై, బహిరంగ ప్రదేశాల్లో మందు తాగిన 174 మందిపై కేసులు పెట్టారు. వాహన నియమ, నిబంధనలు పాటించని వారిపై 334 ఈ-చలానాలు నమోదు చేశారు. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 4,336 మందిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 9,094 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని, తమపై ఆధారపడి జీవించే భార్య, పిల్లలు, ఇతర కుటుంబ సభ్యుల గురించి ఆలోచించాలన్నారు. ద్విచక్ర వాహనాలను నడిపే సమయంలో తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తారని, అందుకు సహకరించాలని ఎస్పీ వకుల్‌జిందాల్ పేర్కొన్నారు.

ఉపాధ్యాయులదే గురుతర బాధ్యత

'రోజురోజుకూ ఉపాధ్యాయుడి బాధ్యత పెరగాలి. తరగతి గదిలో పాఠానికి పరిమితం కాకుండా విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యతను నిర్వర్తించాలి' - వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్సీ



ఏపీటీఎఫ్ సావనీర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అదితి తదితరులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుకలు విజయనగరం పూల్‌బాగ్‌లోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఉపాధ్యాయులు గురుతర బాధ్యత నిర్వర్తించాలని వక్తలు పిలుపునిచ్చారు. దివంగత మార్పు బాలకృష్ణమ్మ వేదికగా ప్రారంభ సమావేశం, మధ్యాహ్నం చెన్నుపాటి లక్ష్మయ్య వేదికపై విద్యా సదస్సును నిర్వహించారు. ఎమ్మెల్సీ చిరంజీవిరావు మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వం విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుందని, ఉపాధ్యాయులకు స్వేచ్ఛగా పాఠం చెప్పేందుకు అవకాశం కల్పిస్తుందని తెలిపారు. ఉపాధ్యాయుల కోరిక మేరకు 117 జీవో రద్దు చేస్తామని, 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లో కలుపుతున్నట్లు పేర్కొన్నారు. గురువుకు సమాజంలో సముచిత స్థానం ఉందని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. ఒక పాఠశాల ఉపాధ్యాయినిగా తాను రెండేళ్లు పనిచేసిన తర్వాత రాజకీయ బాధ్యత అప్పగించినందున ఇష్టమైన వృత్తిని వదులుకోవాల్సి వచ్చిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు మాట్లాడుతూ మార్పు బాలకృష్ణమ్మ అభిమానినని, ఆయన అడుగు జాడల్లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఏపీ జేఏసీ ఛైర్మన్ కె.వి.శివారెడ్డి మాట్లాడుతూ అందరూ ఐక్యంగా సంఘ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఏపీ ఎన్జీవో ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు, ఫ్యాప్టో ఛైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ పీఎఫ్, ఏపీజీఎల్ఐ ద్వారా ఉపాధ్యాయులు దాచుకున్న డబ్బు ఇచ్చేలా చూడాలన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి, సహాధ్యక్షుడు దిలీప్‌కుమార్, ఉపాధ్యక్షులు టి.దస్తగిరి, ఎ.విశ్వనాథరెడ్డి, డి.ఈశ్వరరావు, ఎం.వెంకట సుబ్బయ్య, కార్యదర్శి రఫీక్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.బలరామ్‌నాయుడు, ఎన్.వి.పైడిరాజు పాల్గొన్నారు.



కూచిపూడి నృత్యం చేస్తున్న విద్యార్థినిలు

మన ఇంటిపైనే సూర్యుడు



పీఎం సూర్యఘర్‌లో సోలార్ ఏర్పాటు

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

పీఎం సూర్యఘర్ పథకం.. ఎస్సీ, ఎస్టీల ఇళ్లలో వెలుగులు నింపనుంది. అర్హులైన లబ్ధిదారులకు ఏపీఈపీడీసీఎల్ యూనిట్లు మంజూరు చేయనుంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేశారు. అందులో భాగంగా గ్రామాల్లో ప్రత్యేక సర్వే చేపట్టారు.

వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు సదుపాయం ఉంది. ప్రస్తుతం వారు నివాసం ఉంటున్న ఇళ్లకు ఏ మేరకు సౌర ప్లాంటు అవసరం ఉందో తెలుసుకుంటున్నారు. అర్హత కలిగిన వారి వివరాలు సేకరిస్తున్నారు. పాక, పెంకుటిల్లు ఉంటే అనర్హులుగా గుర్తిస్తున్నారు.



రాజాంలో సర్వే నిర్వహిస్తున్న ఈపీడీసీఎల్ సిబ్బంది

ఇప్పటికే ఈపీడీసీఎల్ సిబ్బంది నేరుగా ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ప్లాంటు ఏర్పాటుకు గల అవకాశాలు, వినియోగం, లబ్ధిదారుల ఆసక్తి, ముందుగా ఖర్చు, రాయితీ సౌకర్యాలు.. తదితర అంశాలు తెలియజేస్తున్నామని ఈపీడీసీఎల్ విజయనగరం ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. అన్ని వర్గాల వారికీ 300 యూనిట్ల వరకు ఒకే విధంగా రాయితీ ఉంటుందని, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి ఇంకా విధివిధానాలు రాలేదని చెప్పారు. ప్రస్తుతం వారికి 200 యూనిట్ల వరకు ఉచితంగా అందిస్తున్నామని, సూర్యఘర్ పథకాన్ని ఎలా వర్తింపజేస్తారో ఖరారు కావాలన్నారు. అక్టోబరు నాటికి సర్వే పూర్తి చేసి యూనిట్ల ఏర్పాటుకు సిద్ధమవుతామని చెప్పారు.

సర్కిల్	ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు	సర్వే జరిగింది	శాతం
విజయనగరం	50,685	38,641	76.24
పార్వతీపురం	73,338	31,217	42.57

రాయితీలు ఇలా..

- ◆ 300 యూనిట్ల వరకు రాయితీ వర్తిస్తుంది.
- ◆ అన్ని వర్గాల వారికీ ఒక్కో కిలోవాట్‌కు రూ.30 వేల వరకు సబ్సిడీ ఇస్తారు
- ◆ కిలోవాట్ ప్లాంటు ఏర్పాటు చేసుకుంటే రూ.90 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు ఖర్చవుతుంది. ఇందులో రూ.30 వేలు తిరిగి పొందవచ్చు
- ◆ 2 కేవీ ప్లాంటు అయితే రూ.లక్ష నుంచి రూ.1.45 లక్షల వరకు వ్యయం కాగా.. రూ.60 వేల వరకు రాయితీ కింద పొందవచ్చు
- ◆ 3 కేవీ అయితే రూ.1.80 లక్షల నుంచి రూ.2.20 లక్షల వరకు ఖర్చు చేయాలి. ఈ విభాగం వారికి రూ.90 వేల సబ్సిడీ దక్కనుంది.
- ◆ ఈ ప్లాంట్లు 25 ఏళ్ల వరకు పని చేస్తాయి.

104, 108 వాహన సేవల్లో లోపాలుంటే చెప్పండి

క్షేత్రస్థాయిలో రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం 108 వాహనాలతో పాటు 104 (సంచార చికిత్స కేంద్రాలు), తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ నడుపుతోంది. చాలామంది వీటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. కొందరు సంప్రదిస్తున్నా.. సకాలంలో రావడం లేదన్న ఫిర్యాదులున్నాయి. అలాంటి సమస్యలుంటే నేరుగా తమకు చెప్పొచ్చని, సందేహాలు, లోపాలున్నా తెలియజేయాలని ఆయా విభాగాల ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త, 11 జిల్లాల జోనల్ మేనేజర్ నజీర్ హుస్సేన్ తెలిపారు. సంబంధిత సేవలపై 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో తెలియజేశారు.
- న్యూస్‌టుడే, విజయనగరం వైద్యవిభాగం



'న్యూస్‌టుడే'తో జోనల్ మేనేజర్ హుస్సేన్

ముఖాముఖి

వారికి నిరంతరం అందుబాటులో..

తలసీమియా, డయాలసిస్, క్యాన్సర్, సికెల్‌సెల్ ఎనీమియా తదితర వ్యాధులతో బాధపడుతున్న వారిని, గర్భిణులను అత్యవసర రోగులుగా గుర్తిస్తున్నాం. వీరికి నిరంతరం సేవలు ఉంటాయి. నచ్చిన ఆసుపత్రులకు తీసుకెళ్తాం.

సమీప మండలాలకు సమాచారం

108 వాహన చోదకులు పట్టణ పరిధిలో 15 నిమిషాల్లో, గ్రామీణ పరిధిలో 20 నిమిషాల్లో, గిరిజన, సుదూర ప్రాంతాలకైతే 30 నిమిషాల్లో వెళ్లాలి. ప్రస్తుతానికి ప్రతి మండలానికీ ఒక అంబులెన్సు ఉంది. రోగికి అవసరమైన సమయంలో మరో ప్రాంతానికి వాహనం వెళితే.. సమీప మండలాల నుంచి పంపిస్తున్నాం. అందులోనే ప్రాథమిక వైద్యం అందించేలా చూస్తున్నాం. గర్భిణులకు ప్రసవాలు చేసేలా ఈఎంటీలు శిక్షణ పొందారు.



108లో సేవలు

సద్వినియోగం చేసుకోవాలి

108లు 45, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు 38, 104లు 75 తిరుగుతున్నాయి. మూడు విభాగాలను ప్రస్తుతం పర్యవేక్షిస్తున్నా. ఈ మూడింటికీ కలిపి 104 టోల్‌ఫ్రీ నంబరు. లోపాలున్నా.. ఫిర్యాదులు చేయాలన్నా సంప్రదించవచ్చు.

మొదటి ప్రాధాన్యం..

రోగులు 108ను సంప్రదించినప్పుడే వారి పరిస్థితిని వివరిస్తారు. తద్వారా పైనుంచి వచ్చే ఆదేశాలను బట్టే ఈఎంటీలు, పైలట్లు నడుచుకుంటారు. వారికి నచ్చిన ఆసుపత్రికి తీసుకెళ్తారు. రోగి అభిప్రాయానికే తొలి ప్రాధాన్యం ఉంటుంది. అత్యవసరమైతే కొన్నిసార్లు సమీపంలో ఉన్న వైద్యాలయాలకు తీసుకెళ్తారు.

ఆ కేసులే ఎక్కువ

గర్భిణులు ఎక్కువగా మా సేవలు అందుకుంటారు. కొన్నాళ్లుగా డయాలసిస్, కడుపు నొప్పి, అపస్మారక స్థితికి చేరిన వారితో పాటు ఆత్మహత్యాయత్నాలు, పాముకాట్లు కేసులు కూడా వస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు 44 మంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. 679 మంది విషం తాగారు. డయాలసిస్ రోగులు 3,467 మంది కాల్ చేశారు. ఛాతిలో నొప్పితో 1,339 మంది, తీవ్రమైన కడుపు నొప్పితో 2,117 మంది, అపస్మారక స్థితిలో చేరిన వారి సంఖ్య 605గా నమోదైంది.

విద్యావ్యవస్థ ప్రక్షాళన అవసరం

ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు ప్రారంభం

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య (ఏపీటీఎఫ్) రాష్ట్ర మహాసభలు విజయనగరంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భగత్‌సింగ్ మేనల్లుడు, అఖిల భారత విద్యాహక్కు వేదిక (ఏఐఎఫ్ఆర్‌డీఈ) ఛైర్మన్ ఆచార్య జగ్‌మోహన్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రస్తుత విద్యావ్యవస్థ, యువత, ఉపాధ్యాయుల పాత్రపై ప్రసంగించారు. పలువురు వక్తలు తమ



ఓక్ జూబ్లీ లోగో ఆవిష్కరణలో అతిథులు, నాయకులు

ప్రసంగాల్లో విద్యావ్యవస్థ ప్రక్షాళన అవసరాన్ని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమ ప్రారంభంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు నిర్వహణలో జాతీయ జెండాను నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఏఐఎఫ్ఈఏ పతాకాన్ని జాతీయ అధ్యక్షుడు వై.సత్యం, ఏపీటీఎఫ్ ప్రగతి జెండాను ఉపాధ్యాయ ప్రగతి ప్రధాన సంపాదకుడు జి.సత్యనారాయణ ఆవిష్కరించారు. ప్రముఖ చిత్రకారుడు ఇనపకుర్తి సత్యనారాయణ చిత్రకళా ప్రదర్శన ఆకట్టుకుంది. మధ్యాహ్నం జరిగిన విద్యాసదస్సులో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు వి.నాగేశ్వరరావు, హైదరాబాద్‌కు చెందిన నవోదయ సాహితీ సమాఖ్య ప్రతినిధి జతిన్‌కుమార్, ఏయూ ఆచార్యుడు ఆర్.శివప్రసాద్, జిల్లా విద్యాశిక్షణ సంస్థ అధ్యాపకుడు ఎన్.తిరుపతినాయుడు ప్రసంగించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం



విద్యార్థినుల భరత నాట్యం



ఏఐఎఫ్ఈఏ జాతీయ ఉపాధ్యక్షుడు సత్యం ఏకపాత్రాభినయం

అమ్మవారి లడ్డూ రూ.2,55,001


లక్కవరపుకోట, న్యూస్‌టుడే: కోనమసివానిపాలెం గ్రామంలో శనివారం రాత్రి దుర్గాదేవి అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నపూర్ణ అవతారం రోజున దుర్గమ్మకు



పూజలో పాల్గొన్న భవానీ మాలధారులు

పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విశాఖలో తయారు చేసి తీసుకొచ్చిన 54 కిలోల లడ్డూను వేలం వేశారు. పెందుర్తి మండలం పుల్లవానిపాలెం గ్రామానికి చెందిన చక్రి రూ.2,55,001కు సొంతం చేసుకున్నారు. అంబలం పూజలో 123 భవానీ పీఠాల నుంచి వేల సంఖ్యలో మాలధారులు పాల్గొన్నారు.

నేడు హజరత్ ఖాదర్ బాబా జయంతి వేడుకలు



విజయనగరం అయ్యన్నపేట/మయూరికూడలి, న్యూస్‌టుడే: విజయనగరం బాబామెట్ట హుజూర్ హజరత్ సయ్యద్ ఖాదర్ వలీబాబా 128వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు బాబా దర్గా దర్బార్ ధర్మకర్త డాక్టర్ ఎండీ ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ (ఖలీల్ బాబు) ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో భాగంగా ఉదయం దర్గాలో ఖురాన్ పఠనం, ప్రార్థనలు ఉంటాయని, మేళతాళాలు, డప్పువాయిద్యాలు, ఫకీరు మేళాలతో దర్బార్ నుంచి ప్రత్యేక చాదర్, సుగంధం, పూలు, పండ్లతో ఊరేగింపుగా వెళ్లి దర్గాలో బాబావారికి సమర్పించి ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దర్బార్ లంగర్ ఖానాలో విచ్చేసిన భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని బాబా ఆశీర్వచనాలు పొందాలని కోరారు.

'ప్రశస్త్' యాప్‌తో.. లోపాల గుర్తింపు



న్యూస్‌టుడే, కొత్తవలస

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో గుర్తించలేని వైకల్యాలను గుర్తించడానికి ఎన్‌సీఈఆర్టీ 'ప్రశస్త్' పేరుతో ప్రత్యేక యాప్ రూపొందించింది. శారీరక, మానసిక వైకల్యం ఉన్నవారి గురించి అందరికీ తెలుస్తోంది. కానీ పలు రకాల వైకల్యాలు ఎదుర్కొంటున్న విద్యార్థులు చాలా మంది ఉన్నారు. వీరిని ప్రత్యేకంగా గుర్తించాల్సిన అవసరం ఉంది. దసరా సెలవులకు ముందే సర్వే మొదలైంది. ప్రస్తుతం పాఠశాలలకు సెలవులు కావడంతో ఆగింది. విద్యార్థుల్లో అనుమానిత వైకల్యం ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

వంద శాతం నమోదు చేస్తాం.. ప్రశస్త్ యాప్ ద్వారా విద్యార్థుల వివరాలన్నీ వందశాతం నమోదు చేసేలా చూస్తాం. ఈ వివరాలు ఉన్నతాధికారులు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటారు. ప్రస్తుతం దసరా సెలవుల వల్ల సర్వే ఆగింది. పాఠశాలలు పునఃప్రారంభమయ్యాక మొదలుపెడతారు. త్వరితగతిన పూర్తిచేయమని చెప్పాం.

– సిరికి సూర్యారావు, సహిత విద్య జిల్లా సమన్వయకర్త, విజయనగరం

ఉపాధ్యాయులదే బాధ్యత

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల వివరాలను పార్ట్-1లో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పేరు సర్వీసు నంబర్, మెయిల్ ఐడీ, చరవాణి, యూడైస్ కోడ్‌తో లాగిన్ అయ్యాక నమోదు చేయాలి. లోపం ఉన్నట్లు గుర్తించిన విద్యార్థులను పార్ట్-2 కింద ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధించే ఉపాధ్యాయులు పరిశీలిస్తారు.

వీటిని గుర్తిస్తారు..

వైకల్యాలున్న పిల్లలను ధ్రువీకరించడం, స్క్రీనింగ్‌లో ఉపాధ్యాయుల భాగస్వామ్యాన్ని మెరుగుపరచడం, అశాస్త్రీయ నిర్ధారణ, లేబులింగ్ నుంచి రక్షణ, పిల్లల పరిస్థితి గురించి స్పష్టతను సులభతరం చేయడం, వైకల్యం ఉన్న విద్యార్థుల సమగ్ర విద్యను ప్రోత్సహించడం దీని లక్ష్యంగా చెబుతున్నారు. విద్యార్థుల్లో వినడం, చదవడం, మాట్లాడటం, శబ్ద గ్రహణంతో పాటు చెప్పినదాన్ని పదేపదే చెప్పమనడం, రోజువారీ పనులు సొంతంగా చేసుకోలేకపోవడం, అనుమతి లేకుండా క్లాస్ నుంచి వెళ్లడం, నెమ్మదిగా చదవడం, రాయడం, స్పష్టతలేని చేతిరాత, రివర్స్‌గా రాయడం, గణిత చిహ్నాలు అర్థం చేసుకోవడంలో ఇబ్బంది పడటం, పునరావృత ప్రదర్శనలో ఇబ్బందులు, ఆసక్తిగా లేకపోవడం, చెప్పిందే చెబుతూ ప్రతిస్పందించడం, విచారంగా కనిపించడం, ఇతర విద్యార్థులతో పోల్చితే సులభంగా అలసిపోవడం.. ఇలా 171 రకాల లోపాల్లో ఏ రకమైన ఎదుర్కొంటున్నది ఉపాధ్యాయులు స్వీయ పరిశీలనతో నమోదు చేస్తారు.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు : 1,13,424 మంది	ఒకటి నుంచి అయిదో తరగతి వరకు : 46,965
5 నుంచి 10 వరకు : 66,459	యూడైస్ సర్వే ప్రకారం జిల్లాలో 18 ఏళ్లలోపు దివ్యాంగులు : 4,300

ఆలయ పరిసరాల్లో పరిశుభ్రత అవసరం

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఎంతో భక్తితో గుడికి వచ్చే భక్తుడికి తల్లి దర్శనంతో పాటు ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్ అన్నారు. ఆదివారం పైడితల్లి పండగ ఏర్పాట్లను పరిశీలించిన ఆయన ఆలయం వెనుక భాగాన కుప్పలుగా పోసి ఉన్న పూజా సామగ్రిని చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఆలయ సిబ్బందిపై ఉందన్నారు. పండగ సమీపిస్తున్న తరుణంలో త్వరితగతిన క్యూలైన్లు, తాటాకు పందిళ్లు వేసి భక్తులకు కనీస వసతులు కల్పించాలని తెలిపారు. ఎమ్మెల్యే అదితి గజపతి రాజు మాట్లాడుతూ ఏర్పాట్లలో రాజీ పడొద్దని, భక్తునికి సౌకర్యవంతమైన దర్శనం కల్పించే విధంగా సిబ్బంది కృషి చేయాలన్నారు. వీరి వెంట సింహాచలం దేవస్థానం ఈవో, పైడితల్లి పండగ ముఖ్య అధికారి వి.త్రినాధరావు, పైడితల్లి దేవస్థానం ఈవో ప్రసాదరావు ఉన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, అదనపు కమిషనర్ రామచంద్రమోహన్ అమ్మవారిని దర్శించుకున్నారు.



ఏర్పాట్లపై ఏసీ ప్రసాదరావుతో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ రామచంద్రమోహన్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ

కొత్తవలస, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ చట్టంలోని ముఖ్య నిబంధనలు తదితర పది అంశాలపై ఉప సర్పంచులు, ఒక్కో పంచాయతీలో ఇద్దరు వార్డు సభ్యులకు సోమవారం నుంచి రెండు రెండు రోజుల పాటు జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో మండల స్థాయి శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ నెల 7 నుంచి 10 వరకు రెండు విడతల కింద ప్రతి మండలంలో ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ సూచనల మేరకు శిక్షణ తరగతులు నిర్వహించాలని ఎంపీడీవోలకు జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ప్రిన్సిపల్, జడ్పీ సీఈవో బి.వి.సత్యనారాయణ సమాచారం పంపారు. జిల్లాలో 777, పార్వతీపురం మన్యం జిల్లాలో 451 పంచాయతీల్లో మండల ప్రజాపరిషత్తు కార్యాలయాల పరిధిలో శిక్షణ నిర్వహిస్తారు.

పది అంశాలు

పారిశుద్ధ్యం - వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, లేఅవుట్ - బిల్డింగ్ ప్లాన్ నిబంధనలు, పంచాయతీ ఆస్తులు, వీధి దీపాలు - విద్యుత్తు బిల్లులు, ఆర్థిక నిర్వహణ, కోర్టు కేసుల్లో న్యాయపరమైన అంశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సామాజిక సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తారు. 40 నుంచి 50 మంది చొప్పున రెండు బ్యాచ్‌ల కింద శిక్షణ పూర్తి చేయాలని తెలియజేశారు. మొదటి బ్యాచ్‌కు 7, 8 తేదీల్లో, రెండో బ్యాచ్‌కు 9, 10 తేదీల్లో శిక్షణ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకు ఇస్తారు.

విద్యా ప్రణాళికలో క్రీడలు అంతర్భాగం చేయడమే లక్ష్యం

- సమగ్రశిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు



రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌పీడీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యా ప్రణాళికలో క్రీడలు అంతర్భాగం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అప్పుడే విద్యా లక్ష్యాలను చేరుకోగలుగుతామని సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్, ఎండీఎం రాష్ట్ర డైరెక్టర్, కమిషనర్, స్కూల్ ఇన్‌ఫ్రా బి.శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలంలోని కేశవరావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే అండర్-19 బాలికల కబడ్డీ రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా పోటీలను స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఖాళీగా ఉన్న పీఈటీ, పీడీ ఉద్యోగాల భర్తీకి డీఎస్సీ ప్రకటన ఇచ్చి క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందన్నారు. డీఈవో ఎస్.తిరుమల చైతన్య, ఎంఈవో కారు పున్నయ్య, తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు బెండు మల్లేష్, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, పీఈటీ, పీడీల సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.వి.రమణ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.వి.రమణ, 13 జిల్లాల కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారిణిలు పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి దుర్మరణం



సుఖవాసి శంకర్ (పాతచిత్రం)

వంగర, న్యూస్‌టుడే: కాలకృత్యాలు తీర్చుకోవడానికి గ్రామ సమీపంలోని చెరువుకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు అందులో పడి ప్రాణాలు కోల్పోయారు. వంగర మండలం అరసాడ గ్రామానికి చెందిన సుఖవాసి శంకర్ (33) శనివారం రాత్రి చెరువు వద్దకు వెళ్లి కాలు జారి పడిపోయినట్లు మృతుడు తల్లి గౌరమ్మ ఆదివారం వంగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వంగర ఎస్ఐ షేక్ శంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇతను అవివాహితుడు. మృతదేహాన్ని రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగు మందు తాగి బలవన్మరణం

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలు తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన దత్తిరాజేరు మండలంలో చోటుచేసుకుంది. ఎస్.బూర్జవలస ఎస్ఐ రాజేష్ వివరాల మేరకు.. చౌదంతివలసకు చెందిన ఇ.భాస్కరరావు(48) మద్యానికి బానిసై అనారోగ్యం పాలయ్యాడు. శనివారం తీవ్ర కడుపు నొప్పి రావడంతో బాధను తట్టుకోలేక పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. మృతుడికి భార్య చిన్నమ్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తేనెటీగల దాడిలో కొబ్బరి తీత కార్మికుడి మృతి

ఆచంట(మార్టేరు), న్యూస్‌టుడే: గోదావరి తీర ప్రాంతంలో తేనెటీగల దాడిలో తీవ్రంగా గాయపడి విజయనగరం జిల్లాకు చెందిన కొబ్బరి తీత కార్మికుడు మృతిచెందాడు. ఎస్సై వెంకటరమణ కథనం మేరకు.. ఆచంట మండలం అయోధ్య లంక పంచాయతీ మర్రిమూలలోని కొబ్బరితోటలో శనివారం కొబ్బరి దింపు చేస్తుండగా కార్మికుడు బాడితమాని రెల్లబాబు(49) ముఖం, ఇతర శరీర భాగాలపై తేనెటీగలు దాడి చేశాయి. స్థానికులు కోనసీమ జిల్లా పి.గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యం చేయించారు. అక్కడి నుంచి అమలాపురం ఏరియా ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించగా వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. గంట్యాడ మండలం రామవరానికి చెందిన రెల్లబాబు మరో ముగ్గురు కొబ్బరి దింపు పని నిమిత్తం 20 రోజుల క్రితం అయోధ్య లంక వచ్చారు. కొప్పాడి సోమరాజు తోటలో పని చేస్తుండగా ఈ ఘటన చేసుకున్నట్లు తెలిపారు. సహచర కార్మికుడు ఎర్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నాలుగు గంటల నరకం

చెట్టును ఢీకొట్టిన లారీ



క్షతగాత్రుడిని మోసుకువెళ్తున్న పోలీసు

పార్వతీపురం పట్టణం, సీతానగరం, న్యూస్‌టుడే: ఈ ప్రాంతం కాదు.. ఫోన్ ఎక్కడుందో తెలియదు.. చుట్టూ అంధకారం.. కాలు కదపాలన్నా వీలు పడని పరిస్థితి.. ఇలాంటి స్థితిలో ఏకంగా నాలుగు గంటల పాటు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయాడు ఆ లారీ చోదకుడు. లక్కవరపుకోట మండలం పోతంపేటకు చెందిన కె.రమణ లారీ చోదకుడు. ఈ నెల 4న విశాఖ నుంచి తారు ట్యాంకర్‌ను జేకేపూర్ తీసుకెళ్లి అన్‌లోడు చేసి తిరిగి 5న రాత్రి స్వగ్రామం బయలుదేరాడు. రాత్రి ఒంటి గంట సమయంలో సీతానగరం మండలం అంటిపేట సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టరును తప్పించే క్రమంలో లారీ చెట్టును ఢీకొట్టింది. ముందు భాగం నుజ్జవగా డ్రైవర్ అందులో ఇరుక్కుపోయాడు. ఆయన కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఉదయం 5 గంటల సమయంలో అటుగా వెళ్లిన వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు చేరుకొని సహాయక చర్యలు చేపట్టి బాధితుడిని జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అందించి విశాఖకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'సకాలంలో చికిత్స అందకే చనిపోయాడు'



ఎస్ఐకి వివరాలు తెలుపుతున్న కుటుంబీకులు

గజపతినగరం, న్యూస్‌టుడే: ఆసుపత్రికి తీసుకువచ్చిన తమ తండ్రికి సకాలంలో వైద్యులు చేరుకుని చికిత్స చేయకపోవడంతోనే చనిపోయాడంటూ గజపతినగరం మండలం తుమ్మికాపల్లికి చెందిన రాపర్తి నూకరాజు (55) కుమార్తెలు ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో ఉన్న నూకరాజును ఆదివారం గజపతినగరం ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకువచ్చామని, వైద్యుడు పైగది నుంచి అరగంట వరకు రాలేదని మృతుడి భార్య సీత, కుమార్తెలు, ఇతర కుటుంబీకులు అన్నారు. వైద్యుడు చేరుకుని ఒక ఇంజక్షన్ ఇచ్చిన వెంటనే ఆయన గుండెపోటుతో కుప్పకూలాడని రోదించారు. వైద్యం సకాలంలో అందించి ఉంటే బతికేవాడన్నారు. ఎస్ఐ లక్ష్మణరావు సిబ్బందితో చేరుకుని విషయం తెలుసుకున్నారు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకెళ్లారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ అన్నారు.

ఆరోగ్యకర జీవనశైలి అలవర్చుకోవాలి



క్రాస్‌కంట్రీ పోటీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ శాస్త్రి

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: త్రివిధ దళాల్లో ఉన్నతాధికారులుగా స్థిరపడాలంటే ఆరోగ్యకరమైన జీవన శైలి, శారీరక బలం అవసరమని కోరుకొండ సైనిక్ పాఠశాల ప్రిన్సిపల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి చెప్పారు. ఆదివారం కోరుకొండ సైనిక్ స్కూల్ విద్యార్థులకు ఇంటర్ హౌస్ క్రాస్ కంట్రీ రేస్-1 పోటీ నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇటువంటి పోటీలు ఓర్పు, క్రమశిక్షణను పెంచుతాయని, ఆరోగ్యకరమైన పోటీలు విద్యార్థుల వికాసానికి దోహదపడతాయని వివరించారు. జూనియర్ల విభాగంలో మౌర్య హౌస్, సీనియర్ల విభాగంలో గుప్తాహౌస్‌లు మంచి ప్రదర్శన ఇచ్చారు. సీనియర్లలో శైలేష్ చౌదరి, పుష్యేన్, ప్రశాంత్ చౌదరి, జూనియర్లలో అనూప్ సింగ్, ఆశిష్‌సింగ్, రౌనక్‌కుమార్‌లు తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలను, పాల్గొన్న విద్యార్థులను శాస్త్రి, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థికి ప్రశంసాపత్రం అందిస్తున్న ప్రిన్సిపల్

ఓవరాల్ ఛాంపియన్ విశాఖ

రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను విశాఖపట్నం కైవసం చేసుకుంది. వరుసగా బాలురు, బాలికల ఛాంపియన్‌షిప్‌ను కూడా కైవసం చేసుకొని అన్నింటా విజయకేతనం ఎగురవేసింది. ఇక వ్యక్తిగత బాలుర విభాగంలో దుడ్డు శేషు (విశాఖ), ఎస్కే రోషన్ (గుంటూరు) కైవసం చేసుకోగా.. బాలికల విభాగంలో ఎల్.డింపుల్‌మహశ్రీ (ఏలూరు), బాకి శైలజ (విశాఖ), పి.వసంత (విజయనగరం) కైవసం చేసుకున్నారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో విజేతలను సంఘ సభ్యులు ఎన్.శివకుమార్ తదితరులు అభినందించారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి



ప్రమాణస్వీకారం చేస్తున్న జిల్లా కార్యవర్గం

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పార్వతీపురం మన్యం జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యులు ఆదివారం పార్వతీపురంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి సంఘం సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ సూచించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కె.సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా పి.శేషు, ముఖ్య సలహాదారులుగా ఐ.గున్నేశ్వరరావు, పి.సూర్యారావు, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. జిల్లా మహిళా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు స్మృతివనాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని రామసత్యనారాయణ కోరారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి సముచిత స్థానం కల్పించాలని కోరారు. తెదేపా ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు, వివిధ విభాగాల కార్యదర్శులు పి.వెంకటేశ్వరరావు, ఎ.గోవిందరావు పాల్గొన్నారు.

విజయనగరం ఉత్సవాల్లో కవి సమ్మేళనం

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఈ నెల 13, 14 తేదీల్లో విజయనగరం ఉత్సవాల్లో సాహితీ కార్యక్రమాలను స్థానిక ఎమ్మార్ లేడీస్ రిక్రియేషన్ వెల్ఫేర్ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు సాహితీ వేదిక కన్వీనర్, సంస్కృత కళాశాల అధ్యక్షుడు గంట జనార్దననాయుడు తెలిపారు. 13న ఉదయం 10 గంటలకు డాక్టర్ కట్టమూరి చంద్రశేఖరం దర్శకత్వంలో సుభద్రదేవి నిర్వహణలో భువన విజయం నాటకం ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కన్వీనర్లు మానాప్రగడ సాహితి, రత్నాల బాలకృష్ణ, కో-కన్వీనర్లు చీకటి దివాకర్, భోగరాజు సూర్యలక్ష్మి, ఎన్.కె.బాబు ఆధ్వర్యంలో శతాధిక కవి సమ్మేళనం విజయనగరం జిల్లా కవులచే నిర్వహించనున్నామన్నారు. కవి సమ్మేళనంలో పాల్గొనేవారు 10వ తేదీలోగా తమ కవితలను 94401 43488, 94411 76882, 94401 17116 నంబర్లలో ఒకదానికి మాత్రమే యూనికోడ్ ఫాంట్‌లో టైప్ చేసి పంపిస్తూ రెండు కాపీలను కవితా వేదిక వద్దకు తీసుకురావాలన్నారు. దేశభక్తి, సామాజిక స్పృహను కవితా అంశంగా తీసుకొని 20 నుంచి 30 పంక్తులకు మించకుండా ఒకరు ఒక కవితను మాత్రమే పంపించాలన్నారు. ఎంపిక చేసిన కవితపై 14న ఉదయం జక్కు రామకృష్ణ, జీఎస్ చలం ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్తలతో సాహితీ గోష్ఠి నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ ఎ.గోపాలరావు ఆధ్వర్యంలో డాక్టర్ మీగడ రామలింగస్వామి సంగీత నవావధానం నిర్వహిస్తామన్నారు.

వసతి గృహాల్లో డిజిటల్ రిసోర్స్ కేంద్రాలు

- ఉమ్మడి జిల్లాలో ఆరు బీసీ కేంద్రాల్లో ఏర్పాటు
- నవంబరు 14న ప్రారంభానికి సన్నాహాలు



వసతి కేంద్రంలో విద్యార్థులు

విజయనగరం మయూరి కూడలి, పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: సంక్షేమ వసతి కేంద్రాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులకు పోషకాహారం, ఆరోగ్యంతో పాటు ఉత్తమ విద్యను అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో తొలి దశలో బీసీ సంక్షేమ ప్రీమెట్రిక్ వసతి కేంద్రాల్లో డిజిటల్ రిసోర్సు సెంటర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. విజయనగరం, మన్యం జిల్లాల్లో ప్రభుత్వ సొంత భవనాలుండి, 8, 9, 10వ తరగతి విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆరింటిని ఎంపిక చేసింది. తొలి విడతలో విజయనగరం బీసీ కాలనీ, కొత్తవలస, బొబ్బిలి బాలికల వసతిగృహాలు, గజపతినగరం, పార్వతీపురంలో నర్సిపురం, జియ్యమ్మవలస బాలుర వసతి కేంద్రాల్లో ఏర్పాటుకు నిర్ణయించారు. వీటిని నవంబరు 14న ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

అభ్యసనాసక్తి పెంచడానికి..

డిజిటల్ రిసోర్సు సెంటర్ల కోసం వసతి గృహాల్లో ఒక్కో గదిని ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది.. డిజిటల్ ఇంటరాక్టివ్ బోర్డు తదితర సాంకేతిక యంత్రాలు అమరుస్తారు. వివిధ పాఠ్యాంశాల్లో క్లిష్టమైన అంశాలు సులువుగా అర్థమయ్యేలా డిజిటల్ సమాచారాన్ని పెన్‌డ్రైవ్ ద్వారా అందిస్తారు. ఇది చదువులో వెనుకబడిన వారిలో ఆసక్తి పెంచడానికి దోహదపడుతుంది. తొలి దశలో ఈ కేంద్రాల్లో విజయవంతమైతే మిగిలిన వాటిలో కూడా దశల వారీగా ఏర్పాటు చేయనున్నారు. అలాగే వసతి కేంద్రాల్లో ఉండే విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడానికి బోధకులు లేకపోవడంతో ఇబ్బందుల పడుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. గణితం, సైన్సు, ఆంగ్లం, హిందీ తదితర పాఠ్యాంశాల బోధనకు ట్యూటర్లను నియమించాలని జిల్లా శాఖాధికారులకు ఉత్తర్వులు ఇచ్చింది.

సామర్థ్యాలు మెరుగుపడతాయి



డిజిటల్ రిసోర్సు కేంద్రాల ఏర్పాటు వల్ల వసతి గృహాల్లోని విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడతాయి. ప్రస్తుతం గుర్తించిన ఆరు కేంద్రాల్లో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం. విద్యార్థులకు పాఠ్యాంశాల్లో వచ్చే సందేహాలను తీర్చడానికి బోధకులను కూడా నియమించనున్నాం.

–పెంటోజీరావు, ఇన్‌ఛార్జి, బీసీ సంక్షేమ శాఖ, విజయనగరం

బొబ్బిలి

• బొబ్బిలి • రాజాం • గజపతినగరం • చీపురుపల్లి

ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రామభద్రపురం, న్యూస్‌టుడే: రామభద్రపురం మండల కేంద్రంలో యువత ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 220 మంది రోగులు హాజరు కాగా, వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు సంజీవ్‌నాయుడు, ప్రత్యూష, సునీల్, అవినాష్, జగన్ తదితరులు సేవలు అందించారు. బొత్సా రామ్‌సందీప్, చరణ్, భూషణ్, జి.ప్రభాకర్ తదితరులు రోగులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.


శిథిల భవనం.. భయం భయం



గుర్ల ఎంపీడీవో కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం పడితే కారుతోంది. గోడలపై మొక్కలు పెరిగిపోయి బీటలు వారాయి. లోపల పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. గతంలో పలుమార్లు మరమ్మతులు చేసినా ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. దీంతో అధికారులు, సిబ్బంది భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. దీనిపై జేఈ సాల్మాన్‌రాజు వద్ద ప్రస్తావించగా.. కొత్త భవనం నిర్మాణానికి నిధులు వచ్చాయని, త్వరలో పనులు చేస్తామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, గుర్ల

'దయగల' హృదయాలు

పాత వస్తువులు సేకరించి.. పేదలకు పంచి..



'దయగల గోడ' నుంచి దుస్తులు తీసుకెళ్తున్న దృశ్యం

బొబ్బిలి పట్టణంలోని పాతబొబ్బిలికి చెందిన పలువురు యువకులు తొమ్మిదేళ్ల కిందట చేసిన ఓ మంచి ఆలోచన.. నేడు చాలామంది పేదలకు అండగా నిలుస్తోంది. దుస్తులు, ఇతర వస్తువులు పరోక్షంగా అందిస్తూ ఆదర్శంగా నిలిచేలా చేసింది. ఈ యువకులు పాత బొబ్బిలి కూడలి బస్‌స్టాప్ వద్ద 'దయగల గోడ'ను ఏర్పాటు చేశారు. ఇళ్లలోని పాత వస్తువులు, దుస్తులు, చెప్పులు, పాత్రలు సేకరించి గోడ వద్ద ఉంచుతున్నారు. అవసరమైన పేదలు అక్కడికి చేరుకుని వాటిని ఉచితంగా తీసుకెళ్తున్నారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి

వారం వారం సేకరణ


ఆదివారం ఉద్యోగులతోపాటు దాదాపు అన్ని వర్గాల వారు ఇళ్ల వద్దే ఉంటారు. ఆ రోజున కమిటీగా ఏర్పడ్డ పదిమంది యువకులు ఇంటింటికీ వెళ్లి ఇళ్లలో ఖాళీగా ఉన్న వస్తువులు, వాడేసి నిరుపయోగంగా ఉన్నవి ఇవ్వాలని కోరుతున్నారు. అలా సేకరించినవి గోడ వద్ద ఉంచుతున్నారు. నెలకు దాదాపు 500 జతల దుస్తులు, 100 జతల చెప్పులు, ఇతర వస్తువులు పేదలు తీసుకెళ్తున్నారు. తొమ్మిదేళ్లలో 10 సైకిళ్లు కూడా పేద విద్యార్థులకు అందజేసినట్లు చెప్పారు. నెలకు సుమారు రూ.50 వేలు విలువ చేసే పాత వస్తువులను అందిస్తున్నట్లు కమిటీ సభ్యులు చెబుతున్నారు.

ఎంతో సంతృప్తి



పేదవారే కాకుండా మధ్య తరగతి కుటుంబాలకు చెందిన కొంతమంది గోడ వద్దకు వచ్చి కావాల్సినవి తీసుకువెళ్తున్నారు. ఈ పని ఎంతో సంతృప్తి ఇస్తోంది. దీన్ని ఆదర్శంగా తీసుకుని చాలామంది కార్యక్రమాలు చేపడుతున్నారు. – ఎం.విజయమోహనరావు, దయగలగోడ నిర్వాహకుడు

ఇక్కడి నుంచే..



బొబ్బిలి మండలంలోని సుమారు 20 గిరిజన గ్రామాల్లో ప్రతినెలా 300 జతల దుస్తులు పంపిణీ చేస్తున్నాం. అవన్నీ 'దయగల గోడ' నుంచే తీసుకువెళ్తున్నాం. బట్టలు, వస్తువులు అందుకున్న గిరిజనులు ఎంతో ఆనందపడుతున్నారు. దీనివల్ల మాకు ఆత్మ సంతృప్తి కలుగుతోంది. – కృష్ణదాసు, వనమిత్ర అధ్యక్షుడు

ఇతర రాష్ట్రాల్లో చూసి..



దినేష్ కుమార్



ఎం.శ్రీనివాసరావు

కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఇలాంటి గోడల ద్వారా అక్కడి యువత అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. పదేళ్ల కిందట కేరళలో నేను దీన్ని చూశాను. మన ప్రాంతంలో ఎందుకు చేయకూడదనే ఆలోచన వచ్చింది. చాలామంది ఖరీదైన దుస్తులు, చెప్పులు, వస్తువులు తీసుకుని, కొన్నాళ్లకు పక్కన పెడుతుంటారు. అలాంటి వారి వద్దకు వెళ్లి పాత వస్తువులను సేకరిస్తున్నాం. ఈ సాయం చాలా గొప్పది. – దినేష్‌కమార్, ఎం.శ్రీనివాసరావు, యువకులు

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

బొబ్బిలి	- 80085 74367
గజపతినగరం	- 80085 74332
రాజాం	- 80085 74308
గరివిడి	- 80085 74348

? మర్రివలస గ్రామ కాలువల్లో మురుగు పేరుకుపోవడంతో దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. - స్థానికులు

● మురుగు తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. - వెంకటరమణ, ఈవోపీఆర్డీ – న్యూస్‌టుడే, రామభద్రపురం

? ఇంగిలాపల్లి గ్రామం నుంచి పెదమానాపురం సంతతోటకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. పెద్ద గోతులు ఏర్పడటమే కాకుండా కొన్ని చోట్ల ఎత్తు పల్లాలుగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. - గ్రామస్థులు

● ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాను. - వైవీ రాజేంద్రప్రసాద్, ఎంపీడీవో – న్యూస్‌టుడే, దత్తిరాజేరు

? కనిమెరక-దేవుపల్లి రహదారికి ఇరువైపులా తుప్పలు పెరిగి, మలుపుల్లో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. - స్థానికులు

● రహదారుల నిర్వహణలో భాగంగా త్వరలో తుప్పలు తొలగిస్తాం. - ఏఈ, పి.అప్పలనాయుడు, పంచాయతీ రాజ్‌శాఖ – న్యూస్‌టుడే, బొండపల్లి

? బుడతనాపల్లి ఉన్నత పాఠశాలకు దాతలు ఇచ్చిన క్రీడా మైదానం తుప్పలతో నిండి, పాములకు నిలయంగా మారింది. - గ్రామస్థులు

● పరిశీలించి తుప్పలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - వెంకటరావు, ఎంఈవో-2 – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? విజయరాంపురం(బూరిపేట) పొలాలకు వెళ్లే దారిలో కొన్ని చోట్ల విద్యుత్తు తీగలు కిందికి వేలాడుతున్నాయి. వాటిని సరిచేయాలి. - స్థానిక యువకులు

● పరిశీలించి తీగలను సరిచేస్తాం. - సోమేశ్వరరావు, ఏఈ – న్యూస్‌టుడే, తెర్లాం

చెత్త కుప్పలతో తిప్పలు



రామభద్రపురం మండలం మామిడివలస ప్రధాన రహదారి పక్కన చెత్త పారబోయడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించకుండా రహదారుల పక్కన పడేస్తున్నారని వాపోయారు. చెత్తను తరలించడానికి చర్యలు తీసుకుంటామని ఈవోపీఆర్డీ వెంకటరమణ తెలిపారు. వంగర మండలం మద్దివలస, వంగర శివారులోని రహదారుల పక్కనే చెత్త పడేసి.. రోజుల తరబడి వదిలేస్తున్నారు. ఎంపీడీవో త్రినాథరావు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, రామభద్రపురం, వంగర

రహదారి ఇలా.. వెళ్లేదెలా?

రాజాం మండలం దోసరి గ్రామంలోని మురుగు నీరంతా రహదారిపైకి చేరడంతో వాహనచోదకులు, పాదచారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. కాలువలు సక్రమంగా లేవని, వీటిని సరిచేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో శ్రీనివాసరావు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం



తుప్పలతో సాగునీటి ఇక్కట్లు



చింతాడ- రాముడువలస గ్రామాల మధ్య ఉన్న తోటపల్లి పిల్ల కాలువ నిర్వహణకు నోచుకోకపోవడంతో తుప్పలతో నిండిపోయింది. పూడికలు తీయడానికి కూడా నిధులు కేటాయించకపోవడంతో అధికారులు చేతులెత్తేశారు. బొబ్బిలి మండలం చింతాడ, పక్కి, బలిజిపేట మండలం పెదపెంకి గ్రామాల పంట పొలాలకు ఈ కాలువ ద్వారా సాగునీరు అందాలి. తుప్పల కారణంగా పూర్తిస్థాయిలో రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఉపాధి పథకంలో పూడికలు తీయాలని సూచించామని డీఈ కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

మైదానం కాదు.. చెరువే!

రామవరం, సిరిపురం గ్రామాల్లో సాగునీటి చెరువులు మైదానాలను తలపిస్తున్నాయి. చెరువంతా గుర్రపుడెక్క, నాచు కప్పేయడంతో పచ్చని మైదానంలా కనిపిస్తున్నాయి. అధికారులు గుర్రపుడెక్కను తొలగించాలని రైతులు కోరుతున్నారు. ప్రత్యేక నిధుల కోసం ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని తాటిపూడి జలవనరుల శాఖ అధికారి తమ్మినాయుడు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం



గట్టుకు కోత.. రైతుల ఆందోళన



సంతకవిటి మండలం శ్రీహరినాయుడుపేట గ్రామంలోని చెరువు భారీ వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా ఉంది. ప్రస్తుతం చెరువు స్థాయిని మించి నీరు నిల్వ ఉండటంతో గట్టుకు ఎప్పుడు గండి పడుతుందోనని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గట్టు పటిష్ఠ పరిచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ రాజేష్ మాట్లాడుతూ.. చెరువు గట్టును పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, సంతకవిటి

అమ్మా.. అనుగ్రహించు



త్రిపుర సుందరి దేవిగా మానసాదేవి



పాతబొబ్బిలిలో దుర్గమ్మకు శుద్ధజలం తీసుకెళ్తున్న మహిళలు



రాజాంలో లలితా పారాయణం

– న్యూస్‌టుడే, రాజాం, చీపురుపల్లి, చీపురుపల్లి గ్రామీణం, బొబ్బిలి, గ్రామీణం


దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రాజాం పట్టణంలో ఆదివారం లక్ష బిల్వార్చనలో 200 మంది భవానీ భక్తులు కుటుంబాలతో కలిసి పాల్గొన్నారు. దోలపేట కనకదుర్గాలయం ప్రాంగణంలో అమ్మవారి ప్రతిమను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి 116 మంది మహిళలు లలితాపారాయణం చేశారు. చీపురుపల్లిలో కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో కుంకుమార్చనలు, చండీహోమం నిర్వహించారు.



చీపురుపల్లి పట్టణంలోని రుంకాన వీధిలో..



బొబ్బిలిలో దేశమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ



కృష్ణాపురం ఆలయంలో అమ్మవారు

ఉత్తరాంధ్ర స్థాయి పోటీలు



విజేతలకు జ్ఞాపికను అందిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, నిర్వాహకులు

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి కళాభారతి సౌజన్యంతో మల్టీ టాలెంటు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉత్తరాంధ్ర స్థాయి కోలాటం పోటీలు నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 20 బృందాలు పాల్గొని, ప్రతిభ చూపారు. లక్ష్మీశ్రీనివాస(నారాయణప్పవలస), దుర్గాదేవి(పొందూరు), అరసాడ జడ్పీ ఉన్నత పాఠశాల కోలాట బృందాలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. 4, 5, 6 స్థానాల్లో జానకి రమణ(పార్వతీపురం), సిద్ధి వినాయక(నిడగల్లు), బంగారమ్మతల్లి(తోణాం) కోలాట బృందాలు నిలిచాయి. వీరికి డీఎస్పీ శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

పిచ్చిమొక్కల తొలగింపు



మెంటాడ, న్యూస్‌టుడే: పిట్టాడ నుంచి జగన్నాథపురం వెళ్లే రహదారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద ఎస్సై సీతారాం ఆధ్వర్యంలో పిచ్చిమొక్కలు తొలగించారు. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో చర్యలు చేపట్టారు.

అవార్డుల ప్రదానం



సత్కారం పొందిన ఉద్యోగులు, సేవా మూర్తులు

బొబ్బిలి, న్యూస్‌టుడే: అభిమాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా శ్రీ ఎక్స్‌లెన్సు అవార్డుల ప్రదాన కార్యక్రమం జరిగింది. డీఎస్పీ శ్రీనివాసరావు, కంటి వైద్య నిపుణుడు కేవీ అప్పారావు అతిథులుగా హాజరయ్యారు. పలు రంగాల్లో సేవలు అందిస్తున్న జి.వెంకటరావు, వై.మోజేష్, ఎ.పద్మావతి, ఎస్.వి.రమణమూర్తి, ఎం.విజయమోహనరావు, జి.భాస్కరరావు, బి.ప్రసాదరావు, ఎల్.వాసు, ఎం.శ్రీనివాసరావును ఫౌండేషన్ అధినేత ఆర్.రాజగోపాలనాయుడు సత్కరించారు. వీరు ఉత్తమ సేవలు అందించేలా ఈ సత్కారం సహాయపడుతుందన్నారు. సీఐ సతీష్‌కుమార్, రోటరీ జిల్లా అధ్యక్షుడు జేసీ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సంకల్పించుకోవాలి



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ రమణ

గజపతినగరం, న్యూస్‌టుడే: గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను సమాజానికి దూరం చేసేందుకు ప్రతి ఒక్కరూ సంకల్పించుకుని, అమలు చేసేందుకు ముందుకు రావాలని సీఐ జీవీఏ రమణ అన్నారు. మరుపల్లిలో ప్రజలకు అవగాహన కల్పించారు.

18 మందిపై కేసు నమోదు

బాడంగి (రామభద్రపురం), న్యూస్‌టుడే: బాడంగి మండలం కోడూరు శివారులో కోడి పందేలపై ఆదివారం ఎస్సై తారకేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. 14 మందిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.9,200 నగదు, 6 కోడి పుంజులు, 11 చరవాణులు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ● దత్తిరాజేరు: రాజుల రామచంద్రపురం గ్రామానికి చెందిన ముగ్గురు జూదం ఆడుతుండగా అరెస్టు చేసి, రూ.4,200 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. ● వంగర: శివ్వాంలో అక్రమంగా నిల్వ చేసిన 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ శంకర్ తెలిపారు.

మోక్షం ఎప్పుడో..?



దెబ్బతిన్న కుసుమూరు- చినవంతరాం రహదారి

న్యూస్‌టుడే, తెర్లాం

తెర్లాం మండలంలోని కుసుమూరు గ్రామం నుంచి చినవంతరాం వెళ్లే మార్గంలో ఉన్న నడక వంతెన ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతింది. రహదారి మొత్తం కోతకు గురై ప్రజల రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. వాహనచోదకులు చుట్టూ తిరిగి వెళ్తున్నారు. నిత్యం ఇబ్బందులు పడుతున్నామని, మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

రహదారి తాత్కాలిక మరమ్మతులకు రూ.50 వేలు, పూర్తిస్థాయిలో నిర్మాణానికి రూ.1.50 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే బాగుచేయిస్తాం. – రుక్మాంగదనాయుడు, ఏఈ, పీఆర్ ప్రాజెక్ట్సు

కృషి చేస్తాను

కుసుమూరు వద్ద చిన వంతెన, రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు కోరుతూ నా వంతు కృషి చేస్తాను. ఇప్పటికే దీనిపై ఇంజినీరింగు అధికారులతో మాట్లాడాను. – బేబీనాయన, ఎమ్మెల్యే

నాలుగేళ్ల క్రితమే..

వేగావతి నదిని ఆనుకొని ఉన్న ఈ ప్రాంతంలో 2015-16 సంవత్సరంలో సుమారు రూ.60 లక్షలతో నడక వంతెనతో పాటు రహదారి నిర్మించారు. నాలుగేళ్ల కిందట వచ్చిన తుపానుతో రక్షణ గోడతో పాటు రహదారి కొంతమేర కోతకు గురైంది. అలాగే ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు రాకపోకలు సాగించాయి. మూడేళ్ల క్రితం వంతెన రక్షణగోడ, రహదారి బాగుకు రూ.కోటి ఉపాధిహామీ నిధులు కోరుతూ పీఆర్ ప్రాజెక్ట్సు విభాగం అధికారులు ప్రతిపాదనలు పంపినా మంజూరు కాలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు పరిస్థితి ఘోరంగా మారి, పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కుసుమూరు, అంట్లవార, చినవంతరాం, వంతరాం, జనార్దనవలస, నందబలగ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. కూటమి ప్రభుత్వమైనా చర్యలు తీసుకోవాలన్నారు.



పూర్తిగా కోతకు గురైన ఓ పక్క మార్గం

మాజీ మంత్రిని కలిసిన శ్రీనివాస్

గజపతినగరం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి పడాల అరుణ కుమారుడు శరత్ చంద్ర ఇటీవల మృతిచెందారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆమె కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. అమెరికా పర్యటన ముగించుకుని జిల్లాకు శనివారం రాత్రి చేరుకున్న ఆయన ఆదివారం ఉదయం అరుణ ఇంటికి వెళ్లి ఓదార్చారు. నాయకులు గోపాలరాజు, శ్రీధర్, రాంజీ రాజు తదితరులు పాల్గొన్నారు.



పడాల అరుణతో మాట్లాడుతున్న మంత్రి తదితరులు

ఎమ్మెల్సీ పరామర్శ

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్, ఉపాధ్యాయుడు ఆర్‌వీజే నాయుడును ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ ఆదివారం పరామర్శించారు. నాయుడు మాతృమూర్తి నారాయణమ్మ వయోభారంతో ఇటీవల కన్నుమూశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. ఏపీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌వీజే నాయుడును పరామర్శిస్తున్న రఘువర్మ తదితరులు

రహదారి ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని బొలెరో ఢీకొట్టడంతో ముగ్గురు గాయపడిన ఘటన పార్వతీపురం మండలంలో చోటు చేసుకుంది. బొబ్బిలికి చెందిన వి.రామకృష్ణ పార్వతీపురం విద్యుత్తు శాఖలో ఉద్యోగి. ప్రార్థన చేసేందుకు పార్వతీపురానికి చెందిన జి.సురేష్, సీహెచ్.అవినాష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై పాలకొండ వెళ్తున్నారు. అడ్డాపుశిల దాటిన తర్వాత బాచి కూడలి వద్ద వెనుక నుంచి వచ్చిన బొలెరో ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన వారిని జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్టు పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

విజయనగరం

● విజయనగరం ● నెల్లిమర్ల ● ఎస్.కోట

? ప్రశాంతినగర్‌లో కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉంది. - **స్థానికులు**

● అక్కడ చర్యలు తీసుకుంటాం.

- డా.కె.సాంబమూర్తి, ప్రజారోగ్య అధికారి, నగర పాలక సంస్థ

? కంటోన్మెంట్ పోస్టాఫీసు రోడ్డులో రాళ్లు తేలి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది.

- స్థానికులు

● అక్కడ రోడ్డుకు మరమ్మతులు చేయిస్తాం.

- కె.శ్రీనివాస్, ఏఈ, నగర పాలక సంస్థ

? గంట స్తంభం గడియారం మూడు నెలల నుంచి పనిచేయడం లేదు.

- ఎంపీజీ ఈశ్వరరావు, స్థానికుడు

● పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- నల్లనయ్య, కమిషనరు, నగరపాలక సంస్థ

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

శుభ్రం చేశారు

స్పందనకు వందనం

విజయనగరం పట్టణం: స్థానిక థెరిస్సా క్లబ్ దారిలో చెత్త గుట్టలు పేరుకుపోయాయి. దీనిపై స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలియజేశారు. సమస్యను ప్రజారోగ్య అధికారి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి చర్యలు తీసుకున్నారు.

దీపాలు వెలిగాయ్

విజయనగరం పట్టణం: పీఎస్ఆర్ కాలనీ, కామాక్షినగర్‌లో వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. దీంతో ఈఈ ఎస్.అప్పారావు దృష్టికి తీసుకెళ్లగా స్పందించి చర్యలు తీసుకున్నారు.

నేడు ఎమ్మెల్యే ప్రజాదర్బార్

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఎస్.కోట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఈవోపీఆర్డీ లక్ష్మి ఆదివారం తెలిపారు. మండల, డివిజన్‌స్థాయి అధికారులందరూ పాల్గొంటారన్నారు. ఎమ్మెల్యే ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.


ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలని రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతీస్వామి అన్నారు. ఆదివారం ఒమ్మి గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పసుపు కొమ్ముల దుర్గమ్మ విగ్రహాన్ని సందర్శించారు. ప్రతి ఒక్కరూ దైవాన్ని పూజించాలని చెప్పారు. గోమాత సకల దేవతలకు నిలయమని అన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతీస్వామి తదితరులు

ముఖాముఖి



మినీ గోకులాలు వస్తున్నాయ్..

పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

పశువుల ఉత్పత్తిని పెంచి.. వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవడంపై దృష్టిసారిస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ ఏడీ ఉమాశంకర్ మహాపాత్రో తెలిపారు. ప్రతి మండలానికి మినీ గోకులాలు 25 చొప్పున ఇచ్చేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుంటుందన్నారు. వివిధ సీజన్లలో పశువులకు సంక్రమించే వ్యాధులను నివారించేందుకు క్షేత్రస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువుల సంరక్షణ, బీమా, కృత్రిమ గర్భోత్పత్తి తదితర అంశాలు ఆయన మాటల్లోనే.. – న్యూస్‌టుడే, భోగాపురం

ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు

పాడి రైతులకు మినీ గోకులాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ గోకులాలను కేవలం పశువులకే కాకుండా గొర్రెలు, మేకలు, పౌల్ట్రీలకు ఉపయోగించుకునే సౌలభ్యం కల్పిస్తుంది. దీనిపై ప్రభుత్వ ఉత్తర్వు మేరకు రాయితీ పథకాలు ప్రవేశపెట్టనున్నారు. రైతులు నష్టపోకుండా ఉండాలనే ఉద్దేశంతో గతంలో ఇచ్చి.. సగంలో నిలిచిపోయిన గోకులాల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టింది.

సకాలంలో టీకాలు..

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో దాదాపు 60 వేల వరకు పశువులు ఉన్నాయి. దాదాపు అన్నింటికీ సకాలంలో టీకాలు వేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆవులు, గేదెలకు గొంతు, జబ్బవాపు, ముద్ద చర్మం వ్యాధి నివారణకు టీకాలు వేశాం. గొర్రెలు, మేకలకు చిటుకు వ్యాధి, చీడ పారుడు తదితర వాటికి ప్రణాళిక ప్రకారం వేస్తున్నాం. పశుగ్రాసం సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే రైతుసేవా కేంద్రాల ద్వారా 75 శాతం రాయితీపై విత్తనాలను అందజేస్తున్నాం. సమీకృత దాణా కిలో రూ.6.50గా యూనిట్ 200 కిలోల వంతున ఎంత కావాలన్నా అందజేస్తున్నాం. గడ్డి కత్తిరించుకునే పరికరాలను కూడా రాయితీపై అందజేస్తున్నాం. ఈ అవకాశాన్ని పోషకులు సద్వినియోగం చేసుకునేలా గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

సంచార వైద్య సేవలు

సంచార పశువైద్యశాలలు అందుబాటులో ఉన్నాయి. 1962 నంబరుకు సమాచారం అందిస్తే పశువుల వద్దకే వాహనం వస్తుంది. మెరుగైన వైద్యం కోసం పశువును ఆసుపత్రికి తరలించి.. చికిత్స అందించాక తిరిగి తీసుకొచ్చి అప్పగిస్తాం ● పశువులకు నట్టల నివారణ మందులు ఏడాదికి మూడు సార్లు ఇస్తున్నాం ● చూలు ఉన్న పశువులు గర్భస్రావం కాకుండా బ్రుసిల్లా వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నాం ● గొర్రెలు రక్తం పారుకుని నాలుకపై పుళ్లు తదితర వ్యాధులతో మృతి చెందుతుంటాయి. వీటి నివారణ కోసం చీడపాడు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నాం. ● గొర్రెలు క్యూలిక్ ఆయిడే దోమ కాటుతో నీలినాలుక వ్యాధి సోకి మృత్యువాత పడుతున్నాయి. నివారణకు టీకాలు అందిస్తున్నాం.

ఎంటీఎస్ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలి

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: 1998 డీఎస్సీకి చెందిన ఎంటీఎస్ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకట్రావు డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీటీఎఫ్ మహాసభల వద్ద రాష్ట్ర ఫ్యాప్టో ఛైర్మన్ సాయి శ్రీనివాస్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి పెడతామన్నారని, రాష్ట్ర వ్యాప్తంగా 4,072 మంది మినిమం టైంస్కేల్‌పై జీవనం గడుపుతున్నారని వివరించారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎం.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



ఫ్యాప్టో ఛైర్మన్ సాయి శ్రీనివాస్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని, ప్రతి ఉన్నత పాఠశాలకు డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను సమకూర్చాలని, 117 జీవోను రద్దు చేయాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావును ఏపీటీఎఫ్ నాయకులు పి.శ్రీనివాస్, బి.జోగినాయుడు, కె.రవి కోరారు. ఆదివారం ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో చిరంజీవిరావుతో ఉపాధ్యాయులు, అధ్యాపకులు సమావేశమయ్యారు.

● **విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే:** పురపాలక ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులను తక్షణమే చేపట్టాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు, ఫ్యాప్టో ఛైర్మన్ ఎల్.సాయిశ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం అమర్‌భవన్‌లో జిల్లా అధ్యక్షుడు జోగారావు అధ్యక్షతన కార్యవర్గ సమావేశంలో సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ బోధనకు ఆటంకం కలిగించే యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 30 శాతం ఐఆర్, డీఏ బకాయిలు చెల్లించాలని, పని సర్దుబాటులోని లోపాలను సరిచేయాలని కోరారు. నాయకులు సూరిబాబు, శ్యామ్, గోవిందరావు, మురళి, రవి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు అందుకున్న వారికి ఘనంగా సన్మానించారు.

మంత్రి కొండపల్లికి స్వాగతం



మంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు

విజయనగరం ఉడాకాలనీ: రాష్ట్ర ప్రభుత్వం తరఫున పెట్టుబడులను ఆహ్వానించేందుకు అమెరికా వెళ్లిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పర్యటన ముగించుకుని జిల్లాకు విచ్చేశారు. గంట్యాడ మండలం టీడీపీ అధ్యక్షుడు భాస్కరరావు, శ్రీనివాసరావు, మజ్జీరావు తదితరులు మంత్రికి విజయనగరం రైల్వేస్టేషన్ వద్ద స్వాగతం పలికారు.

స.హ.చట్టంపై అవగాహన

శృంగవరపుకోట: సమాచార హక్కు చట్టం వచ్చి 19 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో స.హ.చట్టం జిల్లాసమన్వయ కమిటీ సభ్యుడు డి.సూర్యారావు అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి డి.శ్రీధర్, పాఠకులు ఉన్నారు.

పడకముందే.. పట్టించుకోండి



రంగరాయపురం సమీపంలోని వంతెన దగ్గర రోడ్డు పక్కన ఓ చెట్టు ఎండిపోయి ప్రమాదకరంగా ఉంది. ఈ దారిలో అరకు, అనంతగిరి, పాడేరు తదితర ప్రాంతాలకు నిత్యం అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. విరిగి పడుతుందేమోనని చోదకులు భయపడుతున్నారు. ప్రమాదం జరగక ముందే చెట్టును తొలగించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. జాతీయ రహదారి అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా పరిశీలించి తొలగింపు చర్యలు చేపడతామని ఎస్.కోట ఆర్టీసీ డిపో మేనేజరు రమేష్ చెప్పారు. – న్యూస్‌టుడే, లక్కవరపుకోట

రాకపోకలకు నరకం..

నెల్లిమర్ల నుంచి శ్రీకాకుళం జిల్లా రణస్థలం వెళ్లే రహదారి రామతీర్థం వద్ద.. విజయనగరం నుంచి పాలకొండ వైపు వెళ్లే దారిలో గుంతలుపడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం నానా అవస్థలు పడుతున్నామని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ర.భ.శాఖ ఏఈ నందకుమార్ వద్ద ప్రస్తావించగా.. ప్రస్తుత ప్రభుత్వం రహదారి మరమ్మతులకు ప్రత్యేక నిధులు కేటాయించిందని, త్వరలో టెండర్లు పూర్తి చేసి పనులను ప్రారంభిస్తామన్నారు. – న్యూస్‌టుడే, నెల్లిమర్ల



అల్లుకున్న నిర్లక్ష్యం..



జమ్మాదేవిపేట ర.భ. అతిథి గృహం నుంచి రంగరాయపురం వెళ్లే మార్గం మధ్యలో విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకున్నాయి. ఇవి విద్యుత్తు తీగల వరకు వెళితే.. సరఫరాకు అంతరాయం కలిగే ప్రమాదముందని పలువురు అంటున్నారు. ఆ శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఎల్.కోట ఉప కేంద్రం సహాయ ఇంజినీరు కృష్ణను వివరణ కోరగా.. సిబ్బందిని పంపించి మొక్కలు తొలగిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, లక్కవరపుకోట

గోడలపై రాతలు ఉండరాదు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగర పరిధిలో అనధికార ఫ్లెక్సీలు, పోస్టర్లు, గోడ రాతలు ఉండకూడదని కమిషనరు పి.నల్లనయ్య అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆదేశాల మేరకు నగర పాలక సంస్థకు సహకరించాలని కోరారు. ఆదివారం నగరంలో ఉన్న గోడరాతలను ప్రత్యేక సిబ్బందితో పట్టణ ప్రణాళికా అధికారులు సున్నాలు వేసి శుభ్రపరుస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు గోడలపై గోడ ప్రతులు అంటించిన వారితో తీయిస్తామన్నారు. అపరాధ రుసుము కూడా విధిస్తామన్నారు. అక్టోబరు 15న జరగనున్న పైడితల్లి అమ్మవారి జాతర సమయానికల్లా గోడలన్నీ అందంగా ఉండాలని తెలిపారు.



స్తంభంపై రాతలకు సున్నాలు వేస్తున్న కార్మికులు

14 దుకాణాలు.. రూ.78 లక్షలు

వాణిజ్య సముదాయం.. కొన్ని నెలలుగా నిరుపయోగం



కొత్తవలసలో సుమారు రూ.78 లక్షల అంచనాతో నిర్మించిన 14 దుకాణాల వాణిజ్య సముదాయం కొన్ని నెలల నుంచి నిరుపయోగంగా ఉంది. దానివల్ల నెలకు రూ.80,640 ఆదాయాన్ని జడ్పీ కోల్పోతుంది. దుకాణాల కోసం డిపాజిట్లు కట్టినవారు కేటాయింపు కోసం ఎదురుచూస్తున్నారు.

– న్యూస్‌టుడే, కొత్తవలస

జడ్పీ వారపుసంతను ఆనుకుని కె.కోటపాడు వెళ్లే రోడ్డులో నాలుగు బ్లాక్‌ల కింద మొత్తం 36 దుకాణాలు నిర్మించడానికి ముందు ప్రతిపాదించారు. 2022 నవంబరులో ప్రకటన జారీ చేసి ఔత్సాహిక వ్యాపారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆరు సంవత్సరాల పరిమిత కాలానికి వీటిని అద్దెకు ఇవ్వాలని నిర్ణయించారు. దుకాణాల నిర్మాణ వ్యయాన్ని నిర్దేశిత మొత్తాన్ని తిరిగి చెల్లించే డిపాజిట్ కింద స్వీకరించారు. దీంతో రెండు బ్లాకులకు 14 మంది డిపాజిట్‌లు చెల్లించారు. వీరిలో తొమ్మిది మంది జడ్పీ ప్రతిపాదించిన మేరకు రూ.5,50,000 చొప్పున, అయిదుగురు మాత్రం రూ.3 లక్షలు చొప్పున డిపాజిట్ చెల్లించారు. ఈ అయిదుగురు ఇంకా రూ.2.50 లక్షలు చొప్పున చెల్లించాలి. మొత్తానికి రూ.64,50,000 డిపాజిట్‌ల రూపంలో జడ్పీకి సమకూరింది. దీనికి రూ.13,50,000 కలిపి రూ.78 లక్షల అంచనాతో 14 దుకాణాలు నిర్మించారు. గుత్తేదారు పనులు పూర్తిచేసి షట్టర్లు బిగించి అప్పగించారు. వీటికి ఇంకా విద్యుత్తు మీటర్లు బిగించాలి. వాణిజ్య సముదాయం నిర్మించినా ప్రారంభోత్సవం చేయకపోవడంవల్ల ఇంతవరకు వీటిని వ్యాపారులకు అప్పగించలేదు.

ముందే అద్దె నిర్ణయం

ఈ దుకాణాలకు ముందుగానే అద్దె నిర్ణయించారు. ప్రారంభించాక ప్రతినెలా గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్నవాటికి అడుగుకు రూ.30 చొప్పున, మొదటి అంతస్తుకు రూ.20 చొప్పున అద్దె చెల్లించాలని తెలియజేశారు. ఈ ప్రకారం గ్రౌండ్ ఫ్లోర్ దుకాణానికి రూ.5,760, మొదటి అంతస్తుకు రూ.3,840 నెలకు అద్దె చెల్లించాలి. ఇది కాకుండా ప్రతి దుకాణానికి నెలకు రూ.500 నిర్వహణ వ్యయం చెల్లించాలని షరతు విధించారు. ఏడాదికి ఒకసారి 11 శాతం చొప్పున అద్దె పెంచుతామని ఒప్పందంలో తెలియజేశారు. మొత్తం కలిపి 36 నిర్మించాలని యోచించినా.. చివరకు 14 దుకాణాలు మాత్రమే నిర్మించారు.

ప్రారంభించేలా చర్యలు..

దుకాణాలను ప్రారంభించి డిపాజిట్లు కట్టినవారికి అప్పగించడం కోసం జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు, జడ్పీ సీఈవోతో మాట్లాడుతాం. త్వరలో ప్రారంభించేలా తేదీలు ఖరారు చేస్తాం. దుకాణాలకు విద్యుత్తు మీటర్లు ఏర్పాటుపై జడ్పీ నిర్ణయం తీసుకుంటుంది.

– సీహెచ్.వి.స్వామినాయుడు, పంచాయతీరాజ్ డీఈ, ఎస్.కోట సబ్ డివిజన్

లోకజనని.. కరుణరూపిణి



జామిలో అమ్మవారు..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్గాదేవి లలితాత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గునుపూరుపేట దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఎస్.కోట పట్టణంలోని దారగంగమ్మ ఆలయంలో 200 మంది మహిళలు సామూహిక నవదుర్గ పూజలు చేశారు. వేణుగోపాలస్వామి మహిళా మండలి సభ్యులు అమ్మవార్లను అలంకరించారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సుబ్బలక్ష్మి దంపతులు, సర్పంచి గనివాడ సంతోషికుమారి పాల్గొని పూజలు చేశారు. విజయనగరంలోని మయూరికూడలి నాగోజీపేటలోని విజయకనకదుర్గమ్మ శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. వివిధ రకాల కాయగూరలు, పండ్లు, దుంపలతో దేవిని అలంకరించారు. – న్యూస్‌టుడే, డెంకాడ, శృంగవరపుకోట, జామి, విజయనగరం కంటోన్మెంట్



దారగంగమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



నాగోజీపేట దుర్గాలమ్మ

సంక్షిప్త సమాచారం

జూద శిబిరంపై దాడి

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: నెల్లిమర్ల పూడమ్మతల్లి ఆలయ సమీపంలో నిర్వహిస్తున్న జూద శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకొని రూ.1,270 నగదు సీజ్ చేసినట్లు ఎస్సై బి.గణేష్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు. ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లారీ చోదకుడిపై కేసు

వేపాడ, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని బొద్దాం గ్రామ సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు వల్లంపూడి ఎస్సై బి.దేవి ఆదివారం తెలిపారు. ఎస్.కోట నుంచి బొద్దాం వైపు వస్తున్న లారీకి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో అదుపులోకి తీసుకొని చోదకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఉప సర్పంచులకు శిక్షణ

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని పంచాయతీల ఉప సర్పంచులు, ఇద్దరు వార్డు సభ్యులకు సోమ, మంగళవారాల్లో మండల పరిషత్తు కార్యాలయంలో గ్రామ పంచాయతీ పరిపాలన, ఇతర విషయాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈవోపీఆర్డీ లక్ష్మి తెలిపారు. అన్ని పంచాయతీల ఉప సర్పంచులు, పంచాయతీకి ఇద్దరు వార్డు సభ్యులు హాజరుకావాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం

డెంకాడ, న్యూస్‌టుడే: డెంకాడ పంచాయతీ కార్యాలయం ఎదురుగా విజయనగరం సాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ ఆర్.కనక సింహాచలం, సర్పంచి పి.గౌరి శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

గ్యాస్ పొయ్యి వితరణ

వేపాడ, న్యూస్‌టుడే: సోంపురం జడ్పీ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు గణిత ఉపాధ్యాయుడు ఎ.రవిశంకర్ ఆదివారం కొత్త గ్యాస్‌పొయ్యి అందజేశారు. గతంలో కొనుగోలు చేసిన పొయ్యి పాడైపోయి నిర్వాహకులు పడుతున్న ఇబ్బందులు చూసి కొత్తది కొని ఇచ్చారు.

వ్యాన్ డ్రైవర్ అదృశ్యం

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: నగరంలోని వైఎస్ఆర్ నగర్ ప్రాంతానికి చెందిన పి.వెంకటేష్ (38) ఈనెల 3న సొంత వ్యాన్ తీసుకొని పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తన భర్త కనిపించడం లేదని వెంకటేష్ భార్య నారాయణమ్మ ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగాల వీధికి దగ్గరలోని లైటింగ్ దుకాణానికి సామగ్రి తీసుకొని వెళ్లి వస్తూ ఉంటారని, 3న వెళ్లి తిరిగి రాలేదని, రోడ్డు పక్కన ఖాళీగా వ్యాన్ ఉందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా మునగపాకలో మరిడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవంలో జరిగిన కబడ్డీ పోటీల్లో సత్య కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు ఎం.శ్రీవల్లి, పి.రమ్య, ఎల్.వరలక్ష్మి, ఎం.సేతుమాధవి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. ట్రోఫీతో పాటు రూ.40 వేల నగదు బహుమతి పొందారు. ఆదివారం కళాశాలలో వీరికి అభినందనలు తెలియజేశారు. కళాశాల సంచాలకుడు డా.ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపల్ ఎం.వి.సాయి దేవమణి మాట్లాడుతూ ఇలాంటి విజయాలు క్రీడాకారులకు ఉత్తేజితం చేస్తాయని, ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉంటాయన్నారు. ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ ఎం.సత్యవేణి, ఎన్ఎస్ఎస్ అధికారి సూరపునాయుడు, ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు



విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

మ్యూజిక్ అకాడమీ వార్షికోత్సవం

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: విజయనగరం రోటరీ క్లబ్ ప్రాజెక్టులో భాగంగా ద్వారం నర్సింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ రెండో వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత సంగీత విశ్లేషకుడు కాండూరి గోపీకృష్ణాచార్యులు దశిగి పేర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డా.బాలసుబ్రహ్మణ్యం చేసిన కచేరి అందరినీ అలరించింది. ఆన్‌లైన్ పోటీ నాదారాధన విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. మండపాక రవి, రోటేరియన్లు దుర్గాబాలాజీ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్, ఎ.గోపాలరావు, రమణమూర్తి, ఎం.శ్రీనివాసరావు, సూర్యలక్ష్మి, అప్పలస్వామి, మురళీకృష్ణ, జ్యోతి బచావత్, ఉమా బాలాజీ, గుండ చినవీరభద్రరావు, రఘురాం తదితరులు పాల్గొన్నారు.



సంగీత కచేరి చేస్తున్న బాలసుబ్రహ్మణ్యం

వాయుసేన ఆవిర్భావ దినోత్సవం

విజయనగరం రింగురోడ్డు, న్యూస్‌టుడే: జిల్లా ఎయిర్ ఫోర్సు వెటరన్స్ అసోసియేషన్, ఆశ్రయ బ్లడ్ డోనర్సు క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం యువజన వసతి గృహంలో భారతీయ వాయుసేన 92వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ వెటరన్స్‌ను సత్కరించారు. ఎన్‌వీఎన్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు, రిటైర్డ్ గ్రూపు కెప్టెన్ ఈశ్వరరావు, శ్రీకాకుళం మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, విశ్రాంత ఏడీ వీవీ రాజారావు, సంఘం కార్యదర్శి పెద్ది మధు, నాగభూషణరావు, వెంకటరమణ తదితరుల పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న మహిళలు



ఘటాల మొక్కులు



విచిత్ర వేషధారణలు



తల్లీ.. ఘటం మొక్కు చెల్లిస్తున్నా

ఉత్తరాంధ్ర ఇలవేల్పు విజయనగరం పైడితల్లి అమ్మవారి సిరిమాను పండగ సమీపిస్తోంది. నెలరోజుల ఉత్సవాలు సందడిగా జరుగుతున్నాయి. ఆది, మంగళవారాలు ఘటాల మొక్కుబడులు పోటెత్తుతున్నాయి. నగరంలో ఆదివారం రాత్రి ఇప్పిలివీధి నుంచి సుమారు 300 ఘటాలతో మహిళలు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికతతో ఉట్టిపడింది. – న్యూస్‌టుడే, కంటోన్మెంట్